# స్వేచ్ఛ కోసం

• మధురాంతకం రాజారాం • చిత్రాలు: కె.ఎం. మధుసూదనన్

'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు
నా ఇచ్ఛయే గాక నాకేటి వెరపు
పక్షి నయ్యెద, చిన్ని బుక్షమయ్యెదను....'

కూనిరాగం ఎంతసేపైనా ఈ మూడు నిడుగులతోనే గిరికీలు కొడుతోంది. పిడికిలిలోని నీరు వేళ్ళ సందుల్లో నుంచి జారిపోయినట్టుగా బాల్యప్రాయం నడీ చప్పుడూ లేకుండా కాలం చాటుకు తప్పుకుంది. దానికి చెందిన అనుభూతులు, జ్ఞాపకాలు జీవనగతిలో ఎప్పుడో ఎక్కడో ఇంకిపోయాయి. అకౌంటు పుస్తకాల్లో, కంపెనీ డైరెక్టర్ల మీటింగుల్లో, బ్యాంకు ఖాతాల్లో, సుదూర ప్రయాణాల్లో తలమునకలై పోవటం వల్ల వెనుదిరిగి చూసుకోవడానికి వీల్లేని పరిస్థితి.

ఏనాటి స్వేచ్ఛాగానం! ఎసెసెల్సీ తెలుగు వాచకంలో ఉండేది. అప్పుడు బతుకులో గూడా స్వేచ్ఛ ఉండేది. తాను, చలపతి, రంగనాథం హైస్కూల్లో త్రీ మస్కిటీర్స్ కింద లెక్క! సాయంకాలాల్లో పట్నానికి ఆగ్నేయ దిశగా ఉన్న రౌండ్‌రోడ్సులోకి ఎగిరిపోయి, అలిసిపోయేదాకా గుట్టలెక్కి, టేకు చెట్ల కింద బండలపైన వాలిపోయేవాళ్ళు. 'ఒరే నాయనా, సాత్యకీ! స్వేచ్ఛాగానం పాడరా' అనేవాళ్ళు మిత్రులు.

అప్పటికి తన గొంతు లోకి జీర చొచ్చుకు రాలేదు. స్వరం కాస్త వినదగినంత శ్రావ్యంగానే ఉండేది. కొండ కోనల, చెట్టు చేమల ప్రశాంత వాతావరణంలో తన గానం పొదరింట్లో పుష్ప పరిమళంలా వలయాలు తిరిగిపోయేది. స్వేచ్ఛాగానం ఊహాలోకాలకు రహదారి కదా! ఆ దారుల్లో పడిపోయేవాడు సాత్యకి. తాను పక్షిగా మారిపోతే ఎంత బాగుండునో! పచ్చటి తివాచీ పరిచినట్లుండే పంట పొలాల పైన సాగిపోవచ్చు. కొండల కైవారం నడుమ, లోతైన లోయల్లో, ఎండల జాడలు నడయాడని చోట విహరించవచ్చు. అలల కదలిక లేని జలాశయాల్లో నీడలు చూసుకోవచ్చు. అయితే, మానవుడు తీవ్రంగా దేనినైతే కోరుకుంటాడో దానినుంచే వంచితుడు కావచ్చునని సాత్యకి అప్పటికేమీ కలగనలేదు.

> 'ఒరే నాయనా! ఈ కాంక్రీటు కట్టడాల మహారణ్యంలో నుంచి నేనొక వారం రోజుల ఆట విడుపు పైన స్వేచ్ఛా ప్రపంచంలోకి పారిపోతున్నాను. నా స్వేచ్ఛకేదీ అడ్డు రాకూడదని...'

జీవితం చాలా కర్కశమైందని తరువాత తరువాత గదా తెలిసొచ్చింది. 'అమ్మో ఎంతాశ, ఎంతాశ' అన్నట్టుగా ఒక అదృశ్య శక్తి తనకు మాత్రమే వినిపించేటట్టుగా చేసే వికటాట్టహాసం ఇటీవల పది పదిహేనేళ్ళుగా అతణ్ణి రాత్రుల్లో సరిగ్గా నిద్రపోనివ్వడం లేదు. మనసును నిశ్చలంగా ఉండనివ్వడం లేదు.

అప్పటికీ తానాశించిన స్వేచ్ఛావకాశాల పరిమితుల్ని బాగా కుదించుకున్నాడు సాత్యకి. ఇప్పుడతని ఆశలేవో తెలిస్తే జాలే తప్ప, ఆశ్చర్యం కలిగే ఆస్కారం లేదు. పదేళ్ళ వయసొచ్చేదాకా పెరిగిన పల్లెపట్టు, తన జన్మభూమినొకసారి దర్శించాలి. ఆటలాడుకున్న మామిడి తోపులు, నీటి పాయలకు ఆనకట్టలు కట్టిన ఏటి దొరువులు, ఈదులాడిన కపిల బావులూ తిరిగి చూడాలి. తన చిన్ననాటి ఏకైక నేస్తం రాంబాబుతో ఒకటి రెండు రోజులు గడిపి, ఎన్నెన్నో కబుర్లు తవ్విపోసుకోవాలి.

మరి, పై చదువులు చదువుకున్న పట్నంతో ఏర్పడిన అనుబంధం మాత్రం తక్కువైందా? బస్తీ శివారులోని జైహింద్ టాకీస్‌లో రెండో ఆటకు వెళ్ళి ఖాళీ బెంచీ పైన పడుకోవడం, జనతా మార్కెట్‌కెదురుగా నాయర్ బంకులో టీ తాగడం, మునిసిపల్ పార్కులో ఓ మూలగా కూర్చుని ఉల్లాసంగా తాజ్మహలు బీడీ ముట్టించడం ఇవేవీ నూరార్లు ఖర్చుపెట్టి కొనుక్కోవలసిన అనుభవాలు కావే! మిత్రులతో కలసి రౌండ్‌రోడ్సంతా ఒకసారి చహరా కొట్టి రావడం గూడా ఎన్నడో చేజారిపోయిన పెన్నిధిని చేజిక్కించుకోవడం వంటిదే. వచ్చేశాయి. ఆ అనుభవాలన్నీ అందుబాటులోకి వచ్చేశాయి. ఒక్క రాత్రి మాత్రమే గడువు.

'సికిందరాబాదు నుంచి తిరుపతి వెళ్ళు వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ మరికొద్ది నిమిషాల్లో ఒకటో నంబరు ప్లాట్‌ఫారంలోకి రానున్నది' అన్న ప్రకటన వినిపించడంతో సాత్యకి ఉలిక్కిపడి, చుట్టూరా కలయజూశాడు. ప్లాట్‌ఫారమంతా ప్రయాణ సంరంభం చిందులు తొక్కుతోంది. కొంపదీసి తెలిసిన వాళ్ళెవరైనా చూసి పోతారేమోనని, సాత్యకి ముఖాన్ని రైలు పట్టాలవైపు తిప్పుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన ఒక గొప్ప వణిక్ ప్రముఖుడు కాచిగూడ స్టేషన్ ప్లాట్‌ఫారంలో బెంచీ పైన ఒంటరిగా కూర్చుని గోళ్ళు గిల్లుకున్నాడంటే అది రేపటి ఉదయం పేపర్లో రావలసిన విశేష వార్త గదా! 'ఒరే నాయనా! ఈ కాంక్రీటు కట్టడాల మహారణ్యంలో నుంచి నేనొక వారం రోజుల ఆట విడుపు పైన స్వేచ్ఛా ప్రపంచంలోకి పారిపోతున్నాను. నా స్వేచ్ఛకేదీ అడ్డు రాకూడదని, కారులో తీసుకొచ్చి దింపిన డ్రయివర్ని గూడా వెంటనే వెళ్ళిపొమ్మన్నాను. బాబ్బాబూ, మీకు పుణ్యముంటుంది! నా హాలిడే నన్ను ఎంజాయ్ చెయ్యనివ్వండి! నన్ను చూడకండి, గుర్తించకండి' అన్నట్టుగా అతడి మనసులో ఉక్రోషం వరవళ్ళుదొక్కింది.

"బిడ్డ తల్లిని బాబూ, ధర్మం సెయ్యండి బాబూ" అంటూ ఒక మనిషి ప్లాట్‌ఫారం పైన తిరుగుతోంది. ఆ దీనురాలి ఆక్రోశం చెవిలో పడేటప్పటికి సాత్యకి విచలితుడైపోయాడు. అతడి ముఖం తటాలున కుంచించుకుపోయింది. కళ్ళలో ఆందోళన తొంగి చూసింది. ఆనందప్రదమైన అనుభవాలన్నింటికీ చివర తాను గుండెల్ని కలచివేసే ఒక విషాద సన్నివేశాన్ని ఎదుర్కోవడానికి కావలసిన గుండె నిబ్బరాన్ని ప్రోది చేసుకోవాలి. మనసులోకి చొచ్చుకు వచ్చే హక్కు మధుర స్మృతులకు మాత్రమే ఉండి, చేదైన జ్ఞాపకాలకు మాత్రం లేకుండా పోతుందా? అసలు జీవితమంటే వెలుగు నీడల పడుగు పేక గదా! వెలుగు మాత్రమే కావాలనుకుంటే ఎలా?

అయితే ఒకటి. భావావేశాన్ని బట్టి ఎప్పుడు ఏ మాట మాట్లాడాలో ఆ మాట మాట్లాడడానికైనా, ఏ పని చేయాలో ఆ పని చేయడానికైనా స్వేచ్ఛ చాలా అవసరం. చిరకాలంగా సాత్యకి ముఖం వాచిపోయి ఉండడం అందుకోసమే. ఇప్పుడైనా ఈ మాత్రం స్వేచ్ఛ ఎలా సమకూరింది?

ఒకానొక జపాన్ కంపెనీ సహకారంతో ఇండస్ట్రీ ఒకటి నెలకొల్పాలన్న ప్రతిపాదన వచ్చింది. అనుభవజ్ఞులిచ్చిన సలహా మేరకు, ఫలితం బాగా లాభసాటిగా ఉండొచ్చునన్న భరోసా ఏర్పడింది. సలభై ఎకరాల స్థలం కావాలి. గ్రామీణ ప్రాంతమైతే శ్రేష్ఠం. భూగర్భ జలవనరులు చాలా ముఖ్యం. మెయిన్ రోడ్డుకు ఎంత దగ్గరగా ఉంటే అంత సదుపాయం. ఈ విషయాలన్నింటిలోనూ తారాదేవికి భర్తతో ఏకీభావమే. ఎటొచ్చీ పరిశ్రమ కోసం అతడు తన సొంత జిల్లాను ఎన్నుకోడం మటుకు ఆమెకు మింగుడు పడని కవళమైపోయింది.

"కాదులెండి! మీ మనసులో ఏదో ఆలోచన ఉంది. లేదంటే ఇండస్ట్రీ మీ ప్రాంతంలోనే పెట్టాలనే పట్టింపు పెట్టుకుంటారా?" అంటూ ఆమె భర్తను నిగ్గదీసింది.

ఇరవైయేళ్ళ దాంపత్య జీవనం ఎంత ఇంపితంగాని సందర్భంలోనైనా ఓర్పు వహించడంలో సాత్యకికి గట్టి శిక్షణ ఇచ్చింది. కొందరి మనోక్షేత్రంలో అనుమానం పిచ్చి మొక్కలు తప్పితే, నమ్మకం పూల మొక్కలు పెరగవని అతడికవగతమై పోయింది. పనులు చేసి పెట్టడానికి యంత్రాలు, యంత్రాలకు తీసిపోని మనుషులూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండడం, తినాలని కోరుకున్నదానికీ ఆ తినుబండారం టేబులు పైకి రావడానికీ నడుమ ఎడం లేకపోవడం, స్వయంగా చేయడానికి పూచిక పుల్లంతైనా పని లేకపోవడంవల్ల శరీరం పెరుగుదల అదుపుదప్పడం, పెళ్ళయిన కొత్తలో అప్పుడే బిడ్డలెందుకన్న నిరాదరంతో అబార్షన్ చేయించుకున్నందుకు ప్రతిఫలంగా తరువాత్తరువాత ఎన్నెన్ని చికిత్సలకు లోనైనా బిడ్డలు లేకపోవడం, పెంపకానికి బంధువుల బిడ్డల్ని తెచ్చుకుంటే వాళ్ళు ఇల్లు పీకి పందిరెయ్యడానికే గానీ ఉన్న లోటు పూరించడానికి పనికిరాకపోవడం, కాలం గడవకపోవడంతో బొంబాయి పుస్తకాల షాపుల్లోంచి వరద వెల్లువలా వచ్చిపడిపోయే స్పై, సైకో, సస్పెన్స్, శృంగార నవలల పారాయణం, ఆ నవలలలోని సన్నివేశాలకు

అప్పటికప్పుడే రూపకల్పన జరిగిపోయినట్టుండే స్టార్ టి.వి విధ్వంసక దృశ్యాల సందర్శనం - ఇన్ని పరిస్థితులు చాలవా, మనిషిలోని స్వాభావిక ధర్మాలను హరించడానికి! ఆవిడ బుఱ్ఱ సైతాను కార్ఖానాలా తయారవుతూ వచ్చిన పరిణామ మంతా సాత్యకికి తెలుసు. అందులో దేనిపైన చేయి పడినా ప్రమాదమే! దేన్ని ముట్టుకున్నా ముప్పే!

అందుకే వీలయినంత ముక్తసరిగా బదులిచ్చాడు సాత్యకి - "ఇక్కడి వ్యాపారాలన్నింటిలాగే ఆ ఇండస్ట్రీ గూడా నీ పేరు మీదనే ఉంటుంది. ఎవడో మేనేజరు అక్కడుండి ఆ వ్యవహారాలన్నీ చూసుకుంటాడు. అప్పుడప్పుడూ మనం వెళ్ళొస్తూ ఉంటే చాలు....."

అయినా, సాత్యకి వైపు రూక్షంగా చూస్తూనే ఉంది తారాదేవి. 'తూపుల్లాంటి నా ఈ చూపులు నిన్నెప్పుడూ వెన్నంటే ఉంటా'యన్న హెచ్చరిక ఆ చూపుల్లో ధ్వనించింది. అయితే, అలవాటు పడిపోయిన భార్య వితండ ధోరణిని సాత్యకి అట్టే ఖాతరు చేసే స్థితిలో లేడు.

తన కూతతో తనకు తానే బరాబరులు పలుక్కుంటూ బండి వచ్చి ప్లాట్‌ఫారంలో ఆగింది. మొదటి తరగతి కంపార్ట్‌మెంటుల్లోని కుపేలు జైల్లో మొదటి తరగతి ఖైదీల నివాసాలకు చిన్న సైజు నమూనాల్లా ఉంటాయన్నది సాత్యకి స్వానుభవం. ఎట్లాగో రెండోతరగతి పెట్టెలోనే అతడు రిజర్వేషన్ చేయించుకోగలిగాడు. పెట్టెను, పరుపును బెర్త్ పైకి చేరవేసి, రైలు కదిలేదాకా ఆగి, ఆ తరువాత కిటికీ తలుపు పైకెత్తేశాడు. అతడి స్వేచ్ఛాయాత్రకు గ్రీన్ సిగ్నల్ లభించినట్టయింది.

లేడికి లేచిందే పరుగంటారు. కానీ, పరుగుదీస్తూ వెళ్ళిన చోట చిగురించిన గడ్డిపోచ సైతం కానరాకపోతే, లేడి చెవులు వాల్చేసి బిక్కచూపులు చూస్తుంది. ఇంచుమించుగా సాత్యకికి ఎదురైన పరిస్థితి గూడా అదే! స్వగ్రామం వీధుల్లో అతణ్ణి, వేళ్ళతో లెక్కించదగినందరు మాత్రమే గుర్తించి పలకరించారు. వాళ్ళలో కొందరు "ఏం నాయనా! నీక్కూడా ఈ వక్కకు గాలి మళ్ళిందా?" అని ఎద్దేవా చేశారు. మరికొందరు "బాగా సంపాదించి రానులు పోస్తివంట గదా! ఈ దరిద్రపు కొంపలో ఏముందని వస్తివి నాయనా?" అంటూ కొరకొర చూశారు. అతడు ఆప్యాయంగా స్వాగతం లభిస్తుందని ఆశించిన చోట ఆ ఇంటి ముసలాయన ఏనాడో కళ్ళు మూశాడు. ముసలావిడ కోడలితో పొసగక కూతురింటికి వెళ్ళిపోయింది. తలుపు వెనుక నుంచి తొంగి చూసిన రాంబాబు భార్య "ఆయన ఇంట్లో లేరయ్యా! ఆవుల్ని అడవిలోకి తోలి, నూకాలమ్మ గుట్టకాడ వాటి కోసరం కాపెట్టుకునుంటారు" అంటూ భర్త ఆచూకీ తెలియజెప్పింది.

ఊళ్ళోవాళ్ళ స్వభావాలలాగే, ప్రకృతి పరిసరాలు కూడా వికృతమైపోయి ఉండడం గమనించి సాత్యకి దిగాలు పడిపోయాడు. ముదురు మామిడి చెట్లన్నీ తెగనరికి, మల్బరీ తోటలు పెంచుతున్నారు. దురాక్రమణలకు గురైన ఏరు ఉండిన జాడే తెలియ రాకుండా మటుమాయమైపోయింది. బోరింగు బావులు పడ్డ తర్వాత నీటి చుక్కలేని కపిల బావులు తెరచుకున్న రాక్షసుల నోళ్ళలా భయపెడుతున్నాయి. నిండి దబకలాడ వలసిన ఊరి చెరువులో పల్లెల భవిష్యత్తుకు ప్రతీకలా పాలతీంట్ర మొక్కలు పొదలు పొదలుగా బలిసిపోయి ఉన్నాయి.


మనసారా కుశల ప్రశ్నలు వేసి, అత్యుత్సాహంతో తనను గురించి కొన్ని మంచి కబుర్లు చెప్పగలిగే స్థితిలో లేడు రాంబాబు గూడా. కాల జలధి కెరటాలు ఎన్నెన్ని విధాలుగా అతడిపైన విరుచుకుపడ్డాయో తెలియదు. పదేళ్ళ ప్రాయానికి కండ గలిగిన నేలలో అరటి మోనులా ఉండినవాడు, నడి వయసు రాకమునుపే ఎండిన ముళ్ళకంపలా తయారయ్యాడు. ఆప్త బంధువొకడు చూసిపోవడానికి వస్తే, యావజ్జీవ ఖైదీలో కలిగే సంచలనాన్ని మాటలతో చెప్పడం కష్టం. అలాంటి నిర్వేదాన్ని సాత్యకి, మిత్రుడి ముఖ కవళికల్లో పసికట్టగలిగాడు.

రాంబాబు కళ్ళలో చెమ్మ పెల్లుబికింది. కంఠం గద్గదికమైపోయింది. "ఏం చెప్పమంటావు సాత్యకీ! తల్లికింత గంజి పొయ్యలేకపోయినాను. కట్టుకున్న దాని కోరికలు తీర్చలేకపోయినాను. నలుగురు బిడ్డలైపోయిరి. రోజుకు సేరు బియ్యం లేకపోతే సంసారం సాగదు. ఒకరు మున్నూరడుగుల బోరేస్తే, ఇంకొకడు నన్నూరడుగుల బోరేసి పాతాళ గంగను పాతాళం దారి పట్టిస్తున్నారు. వరిపైరు మాట మరిచిపోతిమి. వేరుశనిగ పండితే పండె. ఎండితే ఎండె. అంతా దైవానుగ్రహం. నాలుగు జెర్సీ ఆవులుండబట్టి బతికిపోతున్నాము. ఆ పాలమ్ముకుంటే వచ్చే డబ్బుతోనే ఉదరపోషణ. ఒక రోజు నేను ఊళ్ళో ఉండననుకో! ఆవులు వస్తు. మర్నాటికి పాలుండవు. కట్టు గూటానికి కట్టిపెట్టిన గొడ్డు చందమైపోయింది నా బతుకు. పగ్గం వీలిచ్చినంతవరకే హద్దు. అదనంగా ఇంకొక అంగుళమైనా కదలాడానికి వీల్లేదు."

ఊళ్ళో రెండు రోజులుండాలని వెళ్ళిన సాత్యకి, వెళ్ళిన రోజు సాయంకాలమే బస్సెక్కి తిరుగుదారి పట్టేశాడు. తన బస్తీ స్నేహితులైనా ప్రపంచపుటెడారిలో ఒయాసిస్సుల్ని చూపిస్తారేమోనన్న ఆశ, అతణ్ణి వెన్నంటి తరుముకొస్తోంది. మిత్రులిద్దరిలోనూ — సొంత ఇంట్లో స్థిర నివాసమున్నవాడు గనుక రంగనాథాన్ని పట్టుకోవడం తేలిక. కాలింగ్ బెల్ నొక్కి, తలుపు తెరిచేసరికి ప్రత్యక్షమైపోయి, మిత్రుణ్ణి సంభ్రమాశ్చర్యాలతో ఉక్కిరిబిక్కిరి చెయ్యాలనుకున్నాడు సాత్యకి. బెల్ నొక్కేవరకు పథకం సజావుగా నెరవేరింది. తలుపు తెరిచినవాడు మాత్రం రంగనాథం కాదు. ఎవరో బొద్దుమీసాలాయన.

"ఇక్కడ.....రంగనాథమని......." అంటూ నీళ్ళు నమిలాడు సాత్యకి.

"ఉండేవాడు, ఒకప్పుడు. ఇల్లమ్మేశాడు. మేము కొనుక్కున్నాం. ఇప్పుడతడుండడం మద్రాసులో."



"మద్రాసా?" ఆశ్చర్యపడడం సాత్యకి వంతే అయింది.

"కూచోండి చెబుతాను" అన్నాడు ముసలాయన.

సినిమాలోకం రంగనాథాన్ని చెయ్యెత్తి పిలిచింది. లేదా, అది పిలిచినట్టు తానే భ్రమించాడు. చిన్న చిన్న పాత్రల ద్వారా తారాపథానికి ఎగబాకవచ్చునని ప్లాను వేశాడు. అయిదేళ్ళు అష్టకష్టాలు పడినా నటుడుగా గుర్తింపు రాలేదు. సినీ మాయాబజార్లో ఆశల్ని అమ్మి డబ్బు చేసుకునే వాళ్ళు చాలామంది ఉంటారు. అలాంటి వాడొకడు రంగనాథానికి తారసిల్లి, "ఒక లక్ష రూపాయలు తీసుకొచ్చావంటే మనమే సినిమా తీద్దాం. నువ్వు సైడ్ హీరోగా కాల్చిపారేస్తావు" అని హామీ ఇచ్చాడు. రంగనాథం ఇల్లమ్మేశాడు. భార్యాబిడ్డల్నిగూడా మద్రాసుకు తరలించాడు. లక్ష రూపాయల పన్నీరు ఏ బూడిదలో కలిసిపోయిందో తెలియదు. వట్టి చేతులతో మిగిలాడు. ఇదంతా పన్నెండేళ్ళ కిందటి సంగతి. ఈ ప్రాంతం వాళ్ళెవరైనా కనిపిస్తే తానిప్పుడు అసిస్టెంట్ డైరెక్టరుగా ఉన్నట్టు చెప్పుకుంటాడట. హోదాలో లైటింగు బాయ్‌కి, అసిస్టెంట్ డైరెక్టరుకు ఆట్టే తేడా లేదంటూ ఒక (అప) ప్రథ వ్యాప్తిలో ఉంది. మొత్తంపైన రంగనాథం అటు తారాపథాన్నీ అందుకోలేకపోయాడు. తిరిగి స్వస్థలానికీ చేరుకోలేకపోయాడు. త్రిశంకుస్వర్గంలో చిక్కువడిపోయాడు, తలకిందులుగా!

సాత్యకి చలపతి కోసం వాకబు చేశాడు. అతడి స్థితిగతులు మరింత అయోమయంగా ఉన్నట్టున్నాయి. ప్రభుత్వ నౌకరీలో ప్రవేశించాడు. ప్రస్తుతం మండల్ రెవెన్యూ ఆఫీసరు పదవిలో ఉన్నాడు. అయితే, కొన్ని దారుణమైన అవలక్షణాలవల్ల డిపార్టుమెంట్ అతణ్ణి భరించలేకపోతోందట. ఒకటి, ముక్కుకు సూటిగా వెళ్ళడం. రెండు, పైవారి అడుగులకు మడుగులొత్తక పోవడం. మూడు, ఎంతటి సిఫార్సునైనా బుట్టదాఖలాచెయ్యడం. నాలుగు, ప్రజాసేవే పరమావధిగా భావించడం. ఈ క్రమశిక్షణా రాహిత్యాన్ని సైరించలేక పలుకుబడి గల ప్రభువులు చలపతి చేత రాయలసీమ ప్రాంతంలోని శంకరగిరి మాన్యాలన్నింటినీ సర్వే చేయిస్తున్నారట! 'అయ్యా, మీ స్నేహితుడు ఫలానా చోట ఉన్నాడని తెలుసుకుని మీరక్కడికి వెళ్ళగలరు. కానీ, మీరు వెళ్ళేటప్పటికి అతడక్కడ ఉంటాడని నమ్మకమేమీ లేదు. ఈలోపుగానే అతడికి టెలిగ్రాం మీద బదలీ ఉత్తర్వు జారీ అయి ఉండవచ్చు' అని విజ్ఞులు కొందరు విషయ వివరణ కావించారు.

చివరి మజిలీ మాత్రమే మిగిలింది.

దిక్కూ దరీ లేని ఓ వితంతువు, ఇద్దరు బిడ్డల్ని పెట్టుకుని ఏ వీధిలో, ఏ సందులో, ఏ గొందిలో, ఏ ఇంట్లో ఉంటుందో ఎవరు చెబుతారు? పాత బంధువులు కొందరుండాలి. వాళ్ళ కోసం తెగ-వెదికాడు సాత్యకి. కట్టుకున్న వాళ్ళ కయితే ఒకే ఇల్లు. అద్దెకుండే వాళ్ళకెన్ని ఇళ్ళో. పైగా ఉద్యోగ జీవనం. స్థిరమైన చిరునామాలెలా ఉంటాయి? ఇలా కాదని, సాత్యకి ఉపాయాంతరం ఒకటి అందిపుచ్చుకున్నాడు. "ఏమండీ! ఆమెకు ముప్పై అయిదు దాకా వయసుండొచ్చు పేరు సత్యవతి. భర్త లేడు ఏడెనిమిదేళ్ళక్రితం క్యాన్సరుతో పోయాడు. ఇద్దరు బిడ్డలుంటారు. కోల ముఖం. మనిషి ఏమంత ఎత్తరీ గాదు. అలాగని పొట్టిగానూ ఉండదు. ఆవిడ ఆచూకీ ఏదైనా చెప్పగలరా?"

చాలామంది తెలియదని పెదవి విరిచేశాక, ఒకతను మాత్రం లేశ మాత్రంగా జాడ చెప్పగలిగాడు. "పేరేమిటో తెలియదు. కానీ, అలాంటి మనిషిని చూచినట్టు గుర్తు. వీధిలో పొయ్యి పెట్టుకుని ఉదయం ఇడ్లీలు, సాయంకాలాల్లో వడలూ చేసి అమ్ముకుంటూ ఉంటుంది. కాలవగట్టు వీధిలో అడగండి."

ఒక మధ్యాహ్న సమయాన ఆమెను వెదుక్కుంటూ బయల్దేరాడు సాత్యకి.

కాలవలోని చెమ్మదనమంతా ఇళ్ళలోకి పాకి వచ్చే కాలవ గట్టు వీధిలో వంద ఇళ్ళయినా ఉంటాయి. అక్కడ 'నాష్టా అంగడి సత్యవతి' అంటే ఆడవాళ్ళందరికీ తెలిసినమాటే! పాతకాలపు చుట్టు భవంతి ఇంట్లో - అది పెరటివైపు వాటా. ముందూ వెనుకగా రెండు గదులున్నట్టున్నాయి. ఎండలో పడి వచ్చాడేమో, సాత్యకికి గదిలోపలి భాగం చీకటి గుయ్యారంలా కనిపించింది. ఆ చీకటిలో మసలే నీడలా ఓ ఆకారం "ఎవరు బాబూ?" అంటూ ద్వారం దగ్గరికొచ్చింది.

గౌనులో సత్యవతి తామర మొగ్గలా ఉండేది. పావడా జాకెట్లలో సన్నజాజి తీగలా ఉండేది. ఓణీలో సంపంగి పూలరెమ్మలా ఉండేది. పెళ్ళికూతురుగా, గృహిణిగా, బిడ్డల తల్లిగా ఆమె ఎలా ఉండేదో సాత్యకికి తెలియదు. లేదంటే జబ్బుతో తీసుకుంటున్న భర్తను వెంటబెట్టుకొచ్చి హైదరాబాదులో అయిదారు వారాలపాటు పడుబాట్లు పడిన సత్యవతి రూపం మాత్రం సాత్యకి మనసులో నుంచి మాసిపోలేదు. ఎవరు మీరని అడుగుతూ, ద్వారాన్ని సమీపించిన ఆకారంలో పోలికలు వెదుక్కుంటూ, ఏం చెప్పాలో తోచక నిశ్చలంగా నిల్చుండిపోయాడు సాత్యకి.

"నువ్వా బావా! ఎప్పుడొచ్చావు? ఇల్లెలా తెలిసింది? రా, కూచో. మంచినీళ్ళు పుచ్చుకుంటావా? తారాదేవిగారు బాగున్నారా?"

**ఊళ్ళోవాళ్ళ స్వభావాలలాగే, ప్రకృతి పరిసరాలు కూడా వికృతమైపోయి ఉండడం గమనించి సాత్యకి దిగాలు పడిపోయాడు. పల్లెల భవితకు ప్రతీకలా చెరువులో పాలతీంట్రు మొక్కలు బలిసి ఉన్నాయి.**

యాంత్రికంగా లోపలికి నడిచి నులక మంచం పైన కూచున్నాడు సాత్యకి. మనసులో విహ్వల భావమేదో హోరు పెడుతోంది. 'నువ్వింకా ఇతరులకు మంచిని కోరుకునే స్థితిలో ఉన్నావా సత్యా?' అని ప్రశ్నించాలని ఉంది. కానీ, ఎంతగా ప్రయత్నించినా నోరు పెగలడం లేదు.

అలవాటువడిపోయినకొద్దీ, కష్టాలు గూడా మామూలు విషయాలై పోయినట్టుగా, కొద్ది నిమిషాలు గడిచేసరికి సాత్యకి కళ్ళు చీకటికి అలవాటువడిపోయాయి. ఓ ట్రంకు పెట్టె, దండెం పైన రెండో మూడో చీరలు, కొన్ని నిక్కర్లు, చొక్కాలు, తలుపు వెనుక రెండు సిరి చాపలు, ఓ మూల ఇడ్లీ పాత్రతోబాటుగా కొన్ని సత్తు బోకులు, స్టీలు గ్లాసులు, ఇంతకంటే ప్రముఖమైనవేవీ గదిలో లేవు. సాత్యకి పరిశీలన ముగిసేలోగా బయటికి వెళ్ళిన సత్యవతి గూడా తిరిగొచ్చేసింది.

"అయ్యొయ్యో, అదేమిటి బావా! వట్టి నులక పైన కూచున్నావా! ఉండుండు, బెడ్‌షీటు వేస్తా."

"అబ్బే, అదంతా ఏమీ వద్దులే సత్యా" వారించాడు సాత్యకి. "గుండెల్లో విచ్చుకత్తులు నూరుతూ, నాలుక పైనుంచి మర్యాదలు ఒలకపోసేవాళ్ళ మధ్య బతుకుతున్న వాణ్ణి. నీకూ నాకూ మధ్య అలాంటి పట్టింపులేవీ అక్కర్లేదు. ఏడేండ్లుగా మనసులో సుళ్ళు తిరుగుతున్న బాధ నాది. నీతో చెప్పుకుంటే తగ్గుతుందేమోనని ఆశ. చాలా ప్రయత్నం చేసి నీ పొడవీ ఆరా తీయగలిగాను. మనం అరమరికలు లేకుండా మాట్లాడుకోవాలి. నువ్వు సత్కారాల మాటేం తలపెట్టొద్దు...."

"అట్లాగే బావా! నువ్వు చెప్పు, నేను వింటాను. లేదా నువ్వడుగు, నేను చెబుతాను" బుద్ధిగా గోడకు చేరగిలబడి కూచుంటూ అంది సత్యవతి.

"గదిలో పాదాలు మోపితే ఒళ్ళంతా జిల్లుమంటోంది. గాలీ, వెల్తురూ లోపలికి చొరబడి వచ్చేటట్టు లేదు. పగటి వేళ గూడా చీకటే కాపలా కాస్తోంది. ఇలాంటి ఇంట్లో ఎలా జీవిస్తున్నావు సత్యా?"

సత్యవతి పెదవులపైన కాగితం పువ్వులాంటి నవ్వొకటి మెసలింది. "ఇల్లే కాదు బావా! కొన్ని జీవితాలు గూడా గాలీ, వెల్తురూ చొరబారని చీకటి కొట్లలాగే ఉంటాయి. ఆడ కూతురికి బతుకు బాటలో ఏవో ఇక్కట్లూ, ఇబ్బందులూ ఎదురయ్యే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. అలాంటి పరిస్థితిలో తన కాళ్ళపైన తాను నిల్చునే వెసులుబాటు ఒకటి ఉంటే అదే ఆమెకు కొండంత అండ. ఉద్యోగార్హత చేకూరే దాకా నన్ను చదివించాలన్న దూరదృష్టి తల్లిదండ్రులకు లేకపోయింది. వాళ్ళు నా కోసం ఒక చిన్న బహిరంగ కారాగారం ఏర్పాటు చేశారు. అది అందమైనదే కావచ్చు. అంతకు మించి ప్రపంచాన్ని తెలుసుకునే అవకాశమే లేకపోయింది.

పెళ్ళయింది. పెళ్ళయ్యాక భర్త అభిరుచులు, అభిమతాలు, నదుపాయాలే చుట్టూరా కటకటాలుగా ఏర్పడి పోయాయి. ఆ పరిమిత పరిధిలో గిరికీలు కొట్టడం మాత్రమే నా చేతనైంది. ఆయన అనారోగ్యానికి గురై జీవన్మరణాల మధ్య ఊగిసలాడిపోయిన ఒకటి రెండేళ్ళ కాలముందే... అది నా పాలిట కత్తుల బోను. ఆయన పోయారు. ఆయన పోవడంతో కత్తుల బోనైతే విచ్ఛేదమైంది గానీ బిడ్డల అవసరాల కోసం, వాళ్ళ భవిష్యత్తు కోసం నా చుట్టూ నేనే మరొక మోస్తరు చెరసాల నిర్మించుకోక తప్పలేదు. అదే ఇది! అయితే, ఇదివరకటి చెరసాలలో కంటే ఇందులో నాకెక్కువ స్వేచ్ఛ ఉంది......"

అడ్డు తగిలాడు సాత్యకి. "ఇది కూడా ఒక స్వేచ్ఛేనా? నేన్నమ్మలేకపోతున్నాను సత్యా."

సత్యవతి పెదవిపై మళ్ళీ దరహాసం పాకింది. "ఆ మాటకొస్తే పరిపూర్ణమైన స్వేచ్ఛ ఈ ప్రపంచంలో ఎవరికైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా సాధ్యమేనంటావా బావా? కూడూ, గూడూ, గుడ్డా, ఆఖరుకు పీల్చే ప్రాణ వాయువు గూడా బాహ్య ప్రపంచంపై ఆధారపడి ఉన్నంతవరకు మానవుడికి స్వేచ్ఛ ఎక్కడిది? లేదంటే స్వేచ్ఛకుండే అవకాశాల్ని విస్తరించుకోవచ్చు. అంతవరకే మనం చేయగలిగింది."

సాత్యకి ఆశ్చర్యపోతూ సత్యవతి వైపు చూడసాగాడు. "ఇన్ని మాటలు ఎప్పుడు నేర్చావు సత్యా! ఇంత బాగా మాట్లాడగలవని నేనెప్పుడూ అనుకోలేదు. నా చెవుల్నే నేను నమ్మలేకపోతున్నాననుకో!"

"కొలిమిలో కాచి, సుత్తితో సాగేటట్టు కొట్టిన కొద్దీ బంగారం మెరుగెక్కడం లేదా బావా! కష్టాల్లో రాటు తేలినకొద్దీ మనిషికి తెలివితేటలబ్బుతాయేమో! మబ్బులెక్కితే గదా మెరుపులు, ఉరుములు, వానలు, వరదలు! దేనికైనా అవసరం రావాలి. అవకాశం ఏర్పడాలి. రెండింటినీ వినియోగించుకునే పూనిక ఉండాలి. ఇవన్నీ నాకిప్పుడు కలిసి వచ్చాయనుకో! 'బెటర్ లేట్ దేన్ నెవర్' అన్నారు గదా! నా బిడ్డలతో బాటుగా నేనూ చదువుకోవడం మొదలెట్టాను. ప్రైవేటుగా పరీక్షలకు కట్టే మాట గాదు. ప్రత్యేకంగా లైబ్రరీ నుంచి గూడా పుస్తకాలు తెచ్చి చదువుకుంటున్నాను.

చదివినకొద్దీ ఎన్నో చీకటి తెరలు విచ్చిపోతున్నాయి. 'బతికే స్వేచ్ఛ అందరికీ

ఉంటుంది. కానీ, బతుకులో స్వేచ్ఛ ఉండాలి' అని నేనెక్కడో చదివాను. 'స్వరాజ్యం ఒకరు దయాధర్మంగా ఇచ్చేది గాదు. మనం మన స్వశక్తితోనే సంపాదించుకోవాలి' అంటాడు మహాత్ముడు. స్వేచ్ఛ గూడా అంతే! అది పిరికి వాళ్ళకు దొరకదు. ఆత్మాభిమానం లేనివాళ్ళకు దొరకదు. ఇడ్లీలు చేసి అమ్ముకుంటూ నన్నూ నా బిడ్డల్ని పోషించుకోవడంలో నాకు నామోషీ ఏమీ లేదు. పెద్ద హొటళ్ళు నడవడమెంతో, ఇదీ అంతే! ఈ బతుకులో నాకు స్వేచ్ఛ ఉంది నేను నిర్భయంగా జీవిస్తున్నాను. కొన్ని ఇబ్బందులున్నాయనుకో! క్రమక్రమంగా గట్టెక్కగలనన్న నమ్మకం ఉంది."

పక్కింటి కుర్రాడెవరో గ్లాసులో కాఫీ తీసుకొచ్చాడు.

"పాలున్నాయి బావా. కానీ నీళ్ళ పాలు. కాఫీ పొడి ఉంది గానీ పాతది. అందుకని బంకులో నుంచి తెప్పించాను." సంజాయిషీ ఇచ్చుకుంది సత్యవతి.

గ్లాసందుకుంటూ అన్నాడు సాత్యకి — "ఎందుకు తెప్పించావు సత్యా? ఉన్న వాటితోనే సరిపెట్టుకోవచ్చునే. నీ చేత్తో నువ్వు విషమిచ్చినా తాగవలసిన పరిస్థితిలో గదా ఉన్నాను నేను!"

"బాగుందిలే! వెదుక్కుంటూ వచ్చిన బంధువుకు అదేనా సత్కారం?" తెల్లబోతూ అడిగింది సత్యవతి.

"కాకపోతే ఏమిటి సత్యా! లోకులు నీ పట్ల ఎంత కర్కశంగా వ్యవహరించి ఉంటారో నేనూహించలేనా? నువ్విందాక ఎవరినైతే 'బాగున్నారా' అని అడిగావో, ఆ తారాదేవినే తీసుకుందాం. పెద్ద ఆస్పత్రిలో చేర్పించి, పెద్ద చికిత్స చేయించి ఎట్లాగైనా భర్తను కాపాడుకుందామని నువ్వు హైదరాబాదు వస్తే, అతణ్ణి మభ్యపెట్టి నీ పబ్బాలేవో గడుపుకునేందుకు వచ్చినట్లు ఆవిడ భావించలేదా? ఆస్పత్రిలో బెడ్ దొరకడం ఆలస్యమైతే లంకంత కొంపలో మీరొక మూల తల దాచుకోవడానికి గూడా ససేమిరా నిరాకరించలేదా? పోనీలెమ్మని అవుట్ హౌస్‌లోకి తరలిస్తే, భోజనాలు పంపడం కూడా బంద్ చేసింది ఆవిడ కాదూ? మనుషులకింత అకారణ ద్వేషం, అర్థం లేని కసి ఎందుకుంటాయో నీకేమైనా అంతు చిక్కిందా సత్యా? భయంకరమైన ఆ ఆస్పత్రి వాతావరణంలో ఇరవైనాలుగ్గంటలూ రోగిని కనిపెట్టుకునే ఉండే దానివి నువ్వు. నీ మనసు బరువు కాస్తా తగ్గిద్దామని నేను నా చాకిరీ రొటీను నుంచి బయటపడి సాయంకాలాల్లో ఆస్పత్రి దగ్గరకు వచ్చేవాణ్ణి. గంగరావి చెట్టు కింద మాట్లాడుకుంటూ కూచునే వాళ్ళం. ఇంటికి వెళ్ళడం కొంచెం ఆలస్యమైతే నా కోసం రణరంగం సిద్ధమై ఉండేది. ఏ సినిమాకెళ్ళొచ్చారు? ఏ హొటల్లో విందు పెట్టించారు. మీ హనీమూన్ బాగా సాగుతోందా? ఎందుకులే సత్యా! నేను చెప్పడానికి గానీ, నువ్వు వినడానికి గానీ వీలుకాని విష బాణాలతో నన్ను తూట్లు పొడిచేసేది. నిన్నేమో, నీ కన్నీళ్ళను నీ చేతనే తాగించేది."

"పోనీలే బావా! అదంతా నీ పట్ల గల ప్రేమేననుకో రాదా? కొన్ని కొన్ని ఆవేశాలకు, ఉద్వేగాలకు లోబడిన మనుషుల ప్రవర్తన వాళ్ళ చెప్పుచేతల్లో ఉండదు. ఎలాంటి పనైనా చేస్తారు. ఎంతటి మాటైనా అంటారు. అలాంటి వాళ్ళను చూచి మనం జాలి పడాలి. కోపపడ్డ మెందుకూ?"

"కాదులే సత్యా! తారాదేవిని వేలెత్తి చూపే అధికారం నాకెక్కడుంది? నీకన్యాయం చేసినవారి జాబితాలో మొదటి పేరు నాదే గదా. నువ్వు నా కోసం కళ్ళలో జ్యోతులు వెలిగించి పెట్టుకొని వేచి చూస్తున్నావు. నేను ఉద్యోగాన్వేషణ కోసం మహానగరంలో జొరబడి కాసుల రాశి పైన కూచునే అవకాశం కనిపించేసరికి, దాన్ని అందిపుచ్చుకోవడానికి నన్ను నేనే కుదువ పెట్టుకున్నాను. ఆత్మ సామ్రాజ్యంలో దివాలాకోరునైపోయాను. పైకి మాత్రం బిజినెస్ మాగ్నెట్‌ని. అంతరంగికంగా కట్టు బానిసని. నాకీ శిక్ష చాలునంటావా సత్యా? నువ్వు నన్ను మన్నించగలవా?"

"అబ్బే, అంత మాటనొద్దు బావా! ఒప్పులో, తప్పులో జరిగిపోతుంటాయి. మనం చేయగలిగిందల్లా వాటి ద్వారా పాఠాలు నేర్చుకోవడమే! పొంగిపోవడం, కుంగి పోవడం కూడా దండగే! వద్దు. గతం మాట తల పెట్టనే వద్దు."

సంభాషణ ఒక కొలిక్కి వచ్చినట్లుగా కొద్ది సేపు ఆ ఇద్దరి మధ్య ఊహలు లేని స్థితీ, మాటలు స్ఫురించని స్థితీ ఏర్పడింది. ఈ స్తబ్ధతకు చివర గుండె గొంతుకలో కొట్లాడుతున్నట్లై సాత్యకే మౌనభంగం కావించాడు.

"చూడు సత్యా పెద్ద మనసు చేసి నువ్వనుమతిస్తే నాకొక మాట చెప్పుకోవాలని ఉంది....."

"......"

"దంచినమ్మకు బొక్కిందే కదా దక్కేది. జనరల్ మేనేజర్ హొదాలో నేను ప్రతి నెలా అయిదు వేల రూపాయల జీతం తీసుకుని నాపేరిట బ్యాంకులో నిల్వ ఉంచాను. అదిప్పుడు కొన్ని లక్షలు దాటింది. అందులో ఏమాత్రమైనా నువ్వు పుచ్చుకుంటే, అదే నాకు కొండంత సంతృప్తి. ప్లీజ్ సత్యా ఒప్పుకోవూ?"

దరికి రానున్న ప్రమాదం నుంచి తటాలున తప్పుకున్నట్టుగా సత్యవతి చివాలున లేచి నిల్చుంది. "వద్దు బావా! మాటే చాలు, మన్నన చాలు. అంతకు మించి నాకేమీ ఇవ్వొద్దు. ఇప్పటికే ఎందరో శ్రేయోభిలాషుల సౌజన్యానికి బందీనై ఉన్నాను. ఇప్పుడిక నీ దగ్గర చేయి సాచి తలకు మించిన కృతజ్ఞతకు కూడా రుణపడి ఉండలేను. చేతులూ, కాళ్ళూ బంధించుకోవడానికి ఇనప గొలుసులే కావాలని లేదు. బంగారు గొలుసులైనా చాలు. ఇందులో ఇంకొకటి ఉంది. నువ్విప్వడంవల్ల, నేను స్వీకరించడం వల్ల తారాదేవికి మనపట్లగల అనుమానాన్ని మనం పరోక్షంగా బలపరిచినట్టవుతుంది. అందుకు నేను సుతరామూ ఒప్పుకోను. లోకంలో ఎల్లలెరుగని మంచితనం ఉండనీ! అవధుల్లేని ఉపకార చింతన ఉండనీ! అయితే, వాటిపైనే ఆధారపడి జీవించడం దైన్య స్థితిని కొనితెచ్చుకోవడమే! ఆ స్థితిలో నుంచి బయట పడాలన్నదే నా కోరిక. దయచేసి నన్ను వెనక్కు లాగొద్దు."

ఆటోలో విశ్రాంతి మందిరానికి తిరిగొస్తున్నాడు సాత్యకి. తనలోని పాత సాత్యకి పూర్తిగా రూపాంతరం చెంది కొత్త వ్యక్తిగా ఏర్పడినట్టు ఒక విచిత్రమైన ఊహ అతడి బుర్రలో క్రొక్కారు మెరుపులా పాకిపోయింది. ఒళ్ళంతా దూది పింజలా తేలిక పడినట్టయిపోయింది. 'మహావేత్తనుగా, ధర్మదాతనుగా, ఉపదేశకుణ్ణిగా నేను నీదగ్గరకొచ్చాను సత్యా! శిష్యుడినై వినమ్రంగా తిరిగి వెళ్ళిపోతున్నాను. స్వేచ్ఛ అంటే ఏమిటో నీ మూలంగా నాకు తెలిసొచ్చింది' అనుకున్నాడు.

రహదారికి చేరువగా, జలవసతికి కొదవ లేని సుక్షేత్రాన్ని సంపాదించడంలో సాత్యకి కృతకృత్యుడయ్యాడు. చుట్టూరా కంచె వేసి దానికి శాంతివనమని పేరు పెట్టాడు. పాతవాటితోబాటు కొత్తగా నాటిన ఫలవృక్షాలతో, పూల మొక్కల పాదులతో, కూరగాయల మళ్ళతో శాంతి వనం కళకళలాడుతూ ఉంటుంది.

ఒకవైపున కొట్టాలు వేసి, చదువుకునే స్తోమతలేని బాలబాలికల కోసం ఒక గురుకుల పాఠశాల ఏర్పాటు చేశాడు. పిల్లలు గూడా వచ్చి చేరడంతో ఆ వనానికి మరింత జీవకళ సమకూరింది. పూచే పూలతో, కాచే కాయలతో, ఎగిరే పిట్టలతో, ఆడుకునే పిల్లలతో ఆహ్లాదకరమైన ఆ ప్రదేశాన్ని చూచిన బస్సు ప్రయాణికులు నిజంగా శాంతివనమేనని అనుకుంటూ ఉంటారు.

పక్షులు గూళ్ళల్లో ఒదిగి, పిల్లలు నిద్రలోకి జారుకునే ఏకాంత నిశాసమయాల్లో తన కుటీరం ముంగిట వేయించుకున్న రాతి బెంచీపైన కూర్చుని, విశాలాకాశం వైపు చూస్తూ సాత్యకి ఆలోచనా నిమగ్నుడవుతూ ఉంటాడు.

అప్పుడతనికి ఇటీవల తాను కొని తెచ్చుకున్న పుస్తకంలోని పద్యభాగం ఒకటి తప్పకుండా స్ఫురణకు వస్తూ ఉంటుంది. 'దివిలో ఊగే విహంగాన్ని భువిలో ప్రాకే పులుగు బంధిస్తుంది. గడియేని ఆగని సూర్యుణ్ణి గడియారపు బాహువులు బంధిస్తాయి. పీత డెక్కల చంద్రుణ్ణి చేతులెత్తి సముద్రం బంధిస్తుంది. రాత్రి వచ్చిన రహస్యపు వానని ధాత్రిని దాగిన వేళ్ళు బంధిస్తాయి.' నిజమే. కానీ, సాత్యకికి ఒకందుకు మాత్రమే ఆశ్చర్యం. ఈ కవితలోని సారాంశం సత్యవతికి ఎలా తెలిసి ఉంటుంది. ■

